www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 1 నవంబర్ 2025
5
వైఎస్ఆర్



వైద్య విద్య ప్రయివేటీకరణ తగదు

ప్రజాశక్తి - గోపవరం : కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రయివేటీకరణ చేయాలనుకోవడం తగదని బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కాలువపల్లిలో వైసిపి అధినేత జగన్ ఆదేశాల మేరకు వైద్య విద్య ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరణ కార్యక్రమాన్ని ఆమె నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి పేదలకు నాణ్యమైన, కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే సంకల్పంతో మెడికల్ సీట్లు పెంచి, విదేశాలకు వెళ్లకుండా ఇక్కడే వైద్య విద్య అభ్యసించేలా చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు అని పేర్కొన్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వైద్య రంగాన్ని ప్రయివేటీకరణ దిశగా తీసుకువెళ్లడం దారుణమని వాపోయారు. కార్యక్రమంలో గోపవరం మండల అధ్యక్షుడు రవి చంద్ర రెడ్డి, బద్వేల్ మండల అధ్యక్షులు మల్లేశ్వర రెడ్డి, ఎంపిపి రామ సుబ్బా రెడ్డి, ఎస్‌సి సెల్ అధ్యక్షుడు పుల్లయ్య, ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మొంథా తుపాన్ వల్ల నష్టపోయిన
రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- పాలకులు మారినా రైతుల స్థితిగతులు మారడం లేదు
- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్
- నష్టపోయిన పంటలను పరిశీలించిన సిపిఎం, రైతు, వ్య.కా.స నాయకులు


పోరుమామిళ్ల : నీట మునిగిన వరిని చూపుతున్న నాయకులు

ప్రజాశక్తి -పోరుమామిళ్ల/కాశినాయన

మొంథా తుపాన్ రైతులను నట్టేట ముంచిందని, దీంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని, నష్టపోయిన పంటలను అంచనా వేసి వారిని ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం సిపిఎం, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కాశినాయన, పోరుమామిళ్ల, అట్లూరు, బద్వేల్, బ్రహ్మంగారిమఠం మండలాల్లో తుపాన్ కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. బాధిత రైతులను పరామర్శించారు. పోరుమామిళ్ల మండలం కందులవారిపల్లె నుంచి కవలకుంట్ల వరకు వరి పొలాలను, గ్రామాల్లో నష్టపోయిన వరి పంటను పరిశీలించి ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కాశినాయన మండలంలో ఆసంవారిపల్లె, చిన్నాయపల్లె, శావిశెట్టి పల్లె, వడ్డమాను, ఇటుకలపాడు గ్రామాలలో మొంథా తుపాన్ ప్రభావంతో అరటి, మినుము, కంది, మొక్కజొన్న, పత్తి పూలు ఇతర వాణిజ్య పంటలు భారీగా దెబ్బతిన్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి పేర్కొన్నారు. ఉద్యాన పంటలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయన్నారు. కురిసిన అధిక వర్షాలతో పత్తి, వరి, మొక్కజొన్న, శనగ, మిర్చి వంటి పంటలు పూర్తిగా కొట్టుకుపోయాయని చెప్పారు. కోతకు సిద్ధంగా ఉన్న ఉల్లి, పత్తి, వరి , వెన్ను దశలో ఉన్న వరిపంట తుపాన్ ప్రభావంతో నేలకొరిగి వరి కంకులు నీటిలో నానుతున్నాయని వాపోయారు. వరిపంట నేలకొరగడంతో యంత్రాలతో కోయడం సాధ్యపడదన్నారు. దిగుబడి సగానికి సగం తగ్గే అవకాశం ఉందని, దిగుబడి తగ్గడం, కోత ఖర్చులు పెరగడంతో వరిపంట సాగుచేసిన రైతులు కౌలు రైతులు తీవ్రంగా నష్టపోనున్నారని తెలిపారు. తక్షణమే పంటనష్టం అంచనా వేసేందుకు వ్యవసాయ, రెవెన్యూ, ఉద్యాన శాఖల అధికారులతో బృందాలను నియమించాలని పేర్కొన్నారు. నిష్పక్షపాతంగా పంటలు నష్టపోయిన రైతులను గుర్తించాలని, పరిశీలన బృందాలలో అధికారులు, సిబ్బందితోపాటు రైతు సంఘం, కౌలు రైతుసంఘాల ప్రతినిధులను భాగస్వాములను చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే దెబ్బతిన్న అన్ని ఆహార పంటలకు ఎకరాకు రూ. 25 వేలు, వాణిజ్య పంటలు, ఉద్యాన పంటలకు ఎకరాకు రూ. 50 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోరుమామిళ్ల మండలంలో కొండారెడ్డిపల్లె నుంచి కవలకుంట్ల వరకు వరి, మొక్కజొన్న రైతులు మొంథా తుపాన్ వల్ల భారీగా నష్టపోయారన్నారు. ఇప్పటికే వరి మొక్కజొన్న ఎకరాకు 40 వేల వరకు ఖర్చు చేశారని, మొక్కజొన్న ఈ వర్షానికి పెద్ద ఎత్తున పాచిపట్టి మొలకలు వస్తున్నాయని పేర్కొన్నారు. కలెక్టర్ వెంటనే చొరవ తీసుకొని ప్రతి గ్రామంలో నష్టపోయిన పంటలను అంచనా వేసి బాధిత రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు బి దస్తగిరి రెడ్డి పి. చాంద్‌బాషా, బి. జకరయ్య కాశినాయన, కాశినాయన మండల సిపిఎం కార్యదర్శి ఎంబడి పోలయ్య, ఎస్. భైరవ ప్రసాద్, వీరయ్య, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు రఘు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం: మండలంలోని లింగాలదిన్నెపల్లెలో వర్షాల వల్ల ధ్వంసమైన అరటి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ మాట్లాడుతూ బద్వేల్ నియోజకవర్గంలోని అట్లూరు, పోరుమామిళ్ల, కాశినాయన, బి కోడూరు, బ్రహ్మం గారిమఠం మండలాలలో నష్టపోయిన పంటలను పరిశీలించామని చెప్పారు. సుమారు 2 వేల ఎకరాలకుపైగా రైతులు నష్టపోయారని అన్నారు. నష్టపోయిన పంటల్లో అరటి అగ్రభాగాన ఉందని పేర్కొన్నారు. 300 ఎకరాలకు పైగా ఉల్లి పంట నష్టం వాటిల్లినట్లుగా తెలుస్తోందన్నారు. పసుపు, వరి పంట పెద్ద మొత్తంలో రైతులు నష్టపోయారని చెప్పారు. మొక్కజొన్న పంట, మినుము, ఉల్లి పంటలను వదిలేసినటువంటి పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశాలు ఇచ్చి తక్షణమే నష్టపోయిన పంటలను గుర్తించి బాధిత రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరిస్తామని చెప్పారు. బ్రహ్మంగారిమఠం మండలంలోని లింగాలదిన్నెపల్లెలో ఓబుగారి మధు అనే రైతు మూడు ఎకరాల అరటిపంట పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. లక్షలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంట చేతికొచ్చే సమయంలో వర్షాల కారణంగా ధ్వంసమైందని, బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చాంద్‌బాషా, పార్టీ మండల కార్యదర్శి సునీల్, మాజీ కార్యదర్శి గోవిందు, రైతులు పాల్గొన్నారు.


బి.మఠం : ధ్వంసమైన అరటిని పరిశీలిస్తున్న నాయకులు


కాశినాయన : తడిసిన ఉల్లి పంటను చూపుతున్న నాయకులు

జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలి : డిఆర్ఒ

ప్రజాశక్తి- కడప

భిన్నత్వంలో ఏకత్వం, సమైక్యత, సౌభ్రాతృత్వాలకు ప్రతీకగా వెలుగొందుతున్న మన భరత జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు పేర్కొన్నారు. సర్దార్ వల్లభాయి పటేల్ 150 వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్‌లో రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టరేట్ అధికారులతో కలిసి సర్దార్ వల్లభాయి పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ భారతదేశపు ఉక్కు మనిషిగా ప్రపంచ దేశాలకు స్ఫూర్తిని ఇచ్చిన సర్దార్ వల్లభ్ భాయి పటేల్ జయంతి రోజును భారత ప్రభుత్వం ఏక్తా దివస్ గా పరిగణించి ఆయనను స్మరించుకోవడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి స్టెప్ సిఇఒ విజయ్ కుమార్, మెప్మా పీడీ, కిరణ్ కుమార్, కలెక్టరేట్‌లోని సూపరింటెండెంట్లు, ఇతర అధికారులు, ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌జిసి జిల్లా కో-ఆర్డినేటర్‌గా విజయప్రసాద్

ప్రజాశక్తి - కడప అర్బన్ : నేషనల్ గ్రీన్ కార్ప్స్ జిల్లా కో-ఆర్డినేటర్‌గా బి.ఎ. విజయప్రసాద్‌ను నియమించారు. శుక్రవారం నియామక పత్రాన్ని డిఇఒ షంషుద్దీన్ అందజేశారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ పాఠశాలలలో నేషనల్ గ్రీన్ కార్ప్స్ కార్యక్రమాలను విస్తృత పరచాలని చెప్పారు. విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ మీద అవగాహన పెంపొందించాలని సూచించారు. విజయ ప్రసాద్ మాట్లాడుతూ తనను జిల్లా కో-ఆర్డినేటర్‌గా నియమించిన డిఇఒకు ధన్యవాదాలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులను భాగస్వాములను చేస్తామని పేర్కొన్నారు. వివిధ పోటీలు, ఎగ్జిబిషన్లు, ప్రాజెక్టులు, నేచర్ క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏడీ రామకృష్ణ, ఎన్‌జిసి మాజీ జిల్లా కో-ఆర్డినేటర్ రమణయ్య, జిల్లా సైన్స్ అధికారి ఎబినేజర్, సైన్స్ మ్యూజియం క్యూరేటర్ రెహమాన్, ఉపాధ్యాయులు గంగాధర్, కృష్ణ కిషోర్, బాలాజీ, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

సేవాశ్రమం సేవలు అభినందనీయం

ప్రజాశక్తి -కాశినాయన : మండలంలోని ఓబులాపురం గ్రామ సమీపంలో ఉన్న వివేకానంద సేవాశ్రమం అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు క్రిష్ణ కిషోర్ పేర్కొన్నారు. శుక్రవారం కడప కలెక్టరేట్ ఆవరణంలోని జిల్లా వయో వృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయంలో సహాయ సంచాలకులు వివేకానంద సేవాశ్రమం వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డిని అభినందిస్తూ ఉత్తమ ప్రశంస పత్రాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా క్రిష్ణ కిషోర్ మాట్లాడుతూ దీన పరిస్థితుల్లో ఉన్నఎంతోమంది అభాగ్యులను అమ్మలా ఆదరిస్తూ, నాన్నలా పోషిస్తున్న రామకృష్ణారెడ్డి భావితరాలకు స్ఫూర్తి దాయకం అన్నారు. అవార్డు రావడం పట్ల ఆశ్రమం వాసులు, సంస్థ ఆత్మీయులు హర్షం వ్యక్తం చేశారు.

విచారణ పేరుతో కాలయాపన తగదు : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - బద్వేలు : బ్రహ్మంగారి మఠం కందిమల్లాయపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ప్రధానోపాధ్యాయుడు రాధాకృష్ణపై విచారణ పేరుతో కాలయాపన తగదని తక్షణమే ఆయనపై పోక్సో కింద కేసు నమోదు చేసి విధులు నుండి సస్పెండ్ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బద్వేల్ పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ రంగనాథ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బ్రహ్మంగారి మఠంలోని కందిమల్లాయపల్లె ఎంపిపి స్కూల్ లోని రాధాకృష్ణ అనే కీచక టీచర్ విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన అందరికీ తెలిసిందే అన్నారు.సంఘటన వెలుగుచూసి ఆరు రోజులు అవుతున్నా కీచక ఉపాధ్యాయుడుపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడంలో జాప్యం ఎందుకు అని ప్రశ్నించారు.

ఉద్యోగులను విస్మరిస్తున్న ప్రభుత్వం : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఉద్యోగ, ఉపాధ్యాయుల వల్ల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వారిని పూర్తిగా విస్మరిస్తోందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం కడపలోని యుటిఎఫ్ భవన్‌లో యుటిఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి రాక మునుపు కూటమి పెద్దలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలు ఇచ్చారని తెలిపారు. ఆ హామీలు నిజమని నమ్మి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు సహకరిస్తే తమ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే ఉద్యోగులకు మెరుగైన వేతనాలను అమలు చేస్తామని, ఉద్యోగులకు చెల్లించాల్సిన అన్ని రకాల బకాయిలను ఆరు మాసాలలోగా చెల్లిస్తామని మాట ఇచ్చిన కూటమి పెద్దలు, అధికారం చేపట్టి 16 మాసాలు గడుస్తున్నా అమలు చేయడం లేదని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పిఆర్‌సిని 2023 జూలై మాసం నుంచి అమలు చేయాల్సినప్పటికీ, గడువు పూర్తయి రెండేళ్లు దాటినా ఆ ఊసే లేదన్నారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా అమలు చేయాల్సిన డిఎలను సైతం ఇవ్వడం లేదన్నారు. నాలుగు డిఎలు చెల్లింపులకు నోచుకోక పెండింగ్‌లో కొనసాగుతున్నాయన్నారు. ఖజానా ఖాళీగా ఉంటే సంక్షేమ పథకాలు ఎలా అమలు చేస్తున్నారో ప్రభుత్వమే సమాధానం చెప్పాలన్నారు. తక్షణం 12వ పిఆర్‌సిని ప్రకటించి, అమలు అయ్యే వరకు 30 శాతం మధ్యంతర భృతిని చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు ఎస్.ఎజాస్ అహ్మద్, కౌన్సిల్ సభ్యులు డి.కృష్ణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గోపీనాథ్, సుబ్బారావు, రామ కేశవ, శివ ప్రసాద్, గని పాల్గొన్నారు.

విద్యార్థులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - కడప : స్థానిక విభిన్న ప్రతిభావంతుల బాలిక వసతి గృహంలో విద్యార్థినులకు కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు మయానా రహమతుల్లా ఖాన్ ఆధ్వర్యంలో శుక్రవారం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి ఎనలేని సేవలందించిన ఉక్కు మహిళగా కీ.శే. ఇందిరాగాంధీ కీర్తి గడించినట్లు స్పష్టం చేశారు. బడుగు బలహీనవర్గాల అభివృద్ధితో పాటుగా దేశంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు అమలు చేశాంని కొనియాడారు. భావితరాలకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు.

సిఐ బాల మద్దిలేటికి సన్మానం

ప్రజాశక్తి - కడప : చింతకొమ్మదిన్నె పోలీస్‌స్టేషన్ సిఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బి.బాల మద్దిలేటిని బేడా బుడగజంగం సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు దూపం రాజు, డి. శ్రీరాములు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, అభినందనలు తెలిపారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు అన్ని విధాలా సహకారం అందిస్తామని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో వివిధ ప్రాంతాలలో సమర్థవంతంగా విధులు నిర్వహించిన అనుభవం బాల మద్దిలేటికి ఉందని చెప్పారు. స్థానిక ప్రజల సమస్యలను పరిష్కరించడంలో సిఐ తమ వంతు కృషి చేస్తారని తాము నమ్ముతున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉన్నతాధికారులు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని ఇందిరమ్మ సర్కిల్ సమీపంలో ఉన్న ఇంటపై అంతస్తును తొలగించాలని మున్సిపల్ అధికారులు చెప్పడం సమంజసం కాదని బాధితుడు నజీర్ అహ్మద్ ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం అధికారుల తీరుకు నిరసనగా ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాల నుంచి ఇక్కడ జీవిస్తున్నామని తెలిపారు. మొదటి అంతస్తు కోసం కార్పొరేషన్ అధికారులకు దరఖాస్తు పెట్టుకున్నామని తెలిపారు. కొందరి వ్యక్తుల ప్రోత్బలంతో తమ ఇంటిని కూల్చాలని అధికారులు చెప్పడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల తీరు మారకపోతే ఆత్మహత్య చేసుకునేందుకు కూడా వెనుకాడమని ఆవేదన వ్యక్తం చేశారు.

స్మార్ట్ కిచెన్ల ఏర్పాటు వేగవంతం చేయాలి

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి- కడప

జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా అమలవుతున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేసి డిసెంబర్ మొదటి వారం నాటికి అన్ని మండలాలలో అందుబాటులోకి వచ్చేలా అధికారులు పని చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా సచివాలయంలోని బోర్డు రూమ్‌లో సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ భవన నిర్మాణాల పురోగతిపై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా స్మార్ట్ కిచెన్ల ఏర్పాటు చేపట్టామని, ఇప్పటికే కడప నగరం, సికె దిన్నె ప్రాంతాల్లో స్మార్ట్ కిచెన్ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నామని చెప్పారు. ఇదే స్ఫూర్తితోనే జిల్లాలో నూతనంగా 33 స్మార్ట్ కిచెన్‌ల ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. ఇందులో 23వివిధ దశల్లో ఉన్నాయని, మిగిలిన 10 స్మార్ట్ కిచెన్ల నిర్మాణ ప్రక్రియను కూడా త్వరితగతిన ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. స్మార్ట్ కిచెన్ల ద్వారా ఆహారం అందిస్తున్న పాఠశాలల్లో వంద శాతం మంది విద్యార్థులు పాఠశాలలోనే డొక్కా సీతమ్మ మధ్యాహ్న పథకం ద్వారా అందించే భోజనాన్ని తింటున్నదీ, లేనిది అందులో నాణ్యత విషయమై వారి తల్లితండ్రుల నుంచి ర్యాండంగా అభిప్రాయాలను సేకరించాలన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా కూరగాయల కొనుగోలు సంబంధిత అంశాలపై డిఆర్‌డిఎ అధికారులు ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో సిపిఒ హజరతయ్య, డిఇఒ శంషుద్దీన్, స్మార్ట్ కిచెన్ల పర్యవేక్షకులు జోయల్ విజయకుమార్, డిఆర్‌డిఎ పీడీ రాజ్యలక్ష్మి, సమగ్ర శిక్ష ఎపిసి నిత్యానంద రాజు, సంబంధిత పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

కడప అర్బన్ : జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్‌లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డిఐఇపిసి) సమీక్ష సమావేశం కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి మరింత విస్తృత పరిచేందుకు అన్ని అనుబంధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. పరిశ్రమల ప్రమోషన్‌కు సంబంధించి ఇంకా ఏవైనా దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లా స్థాయి నుంచి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యువతకు పారిశ్రామిక పెట్టుబడులు, యూనిట్ల స్థాపనపై అవగాహన పెంపొందించాలన్నారు. పారిశ్రామిక అభివృద్ధి పాలసీ (ఐడిపి) 2023-27 శాతం, 2024- 29 శాతం ద్వారా ఎస్‌సి, ఎస్‌టి కేటగిరీకి సంబంధించి 24 ట్రాన్స్‌పోర్టు వాహనాల ఇన్‌వెస్ట్‌మెంట్ల సబ్సిడీ కింద రూ 2.75 కోట్లు రాయితీ మంజూరుకు కమిటీ ఆమోదం తెలిపిందని చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు ఉద్యం రిజిస్ట్రేషన్‌లపై 14 వర్క్ షాపులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సంబంధిత వివరాలను సమావేశంలో కలెక్టర్‌కు వివరించారు. ఆయా అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జిఎం చాంద్ బాషా, ఎపిఐఐసి శ్రీనివాసమూర్తి, లీడ్ బ్యాంకు మేనేజర్ జనార్ధన, డిప్యూటీ చీఫ్ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫాక్టరీస్ చిన్నా రావు, సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, డిఆర్‌డిఎ పీడీ రాజ్యలక్ష్మి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, డిటిఒ అధికారులు, వాణిజ్య పన్నుల శాఖ, ఎపిఎస్ పిడిసిఎల్ శాఖల అధికారులు ఎపిఐఐసి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

- డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్

ప్రజాశక్తి-కడప అర్బన్

భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లా డుతూ డివైఎఫ్ఐ 1980 పంజాబ్ రాష్ట్రంలో లూథియానాలో నవంబర్ 1,2,3 తేదీలలో ఆవిర్భవించిందన్నారు. ముఖ్యంగా అప్పట్లో దేశంలో నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యల మీద పోరాడి పాలక ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు ఎదురొడ్డి నిలిచిన సంఘం డివైఎఫ్ఐ అన్నారు. ఈ పోరాటంలో ఎంతో మంది అమరులైనారన్నారు. సామ్రాజ్యవాద పెట్టుబడిదారి విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతుందన్నారు. నాటి నుంచి నేటి వరకు అనేక పోరాటాలు సాగించి విజయాలు సాధించామన్నారు. డిఎస్‌సి, కానిస్టేబుల్ నోటిఫికేషన్ ఇలాంటివి ఎన్నో నిరుద్యోగుల పక్షాన నిలబడి పోరాడి సాధించామన్నారు. భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, అల్లూరి సీతారామరాజు వంటి స్వతంత్ర సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతామని తెలిపారు. నవంబరు 1,2,3 తేదీల్లో నిర్వహించే డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాలలో యువత పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి విజయ్, ఉపాధ్యక్షులు పెద్దన్న పాల్గొన్నారు.

నిత్యపూజ కోన, పొలతలకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కార్తీకమాసం సందర్భంగా ప్రతి సోమవారమూ నిత్య పూజ కోన, పొలతలకి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్‌టిసి డిపో మేనేజర్ కన్యాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. కడప పాత బస్టాండ్ నుంచి బస్సులు వెళతాయని పేర్కొన్నారు. పొలతలకి ఉదయం 6.30, 9.00, 11.30,14.15, 16.45 గంటలకు బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. నిత్య పూజకోనకు ఉదయం 6.30, 9.30, 12.30, 15.30 గంటలకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని తెలిపారు.

నిరాశ్రయులకు అన్నదానం

ప్రజాశక్తి-కడప అర్బన్



అన్నదాన కార్యక్రమంలో గౌస్‌పీర్

ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఎన్.డి. విజయ జ్యోతి ఆదేశాల మేరకు జిల్లా జనరల్ సెక్రెటరీ సయ్యద్ గౌస్ పీర్ ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ కార్యాలయంలో ఇందిరా గాంధీ విగ్రహానికి పూల మాల వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం పాత రిమ్స్ కూడలిలోని ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆదరణ నిరాశ్రయుల వసతి గృహంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ మైనారిటీ వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ గఫార్, రైతు విభాగం నాయకులు రామచంద్రారెడ్డి, డివిజన్ ఇన్‌ఛార్జులు అంజన్ కుమార్, దాసరి శ్రీనివాసులు, సాదిక్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

భవిష్యత్తును సమర్థవంతంగా తీర్చిదిద్దుకోవాలి

ప్రజాశక్తి - కడప సిటీ

కడప ప్రభు త్వ మెడికల్ కళా శాలలో ప్రిన్సిపల్ డాక్టర్ టి. జమున అధ్యక్షతన శుక్రవారం ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వ హించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. జమున విద్యార్థులతో మాట్లాడుతూ, వైద్య విద్యార్థులు తమ భవిష్యత్తును సమర్థంగా తీర్చిదిద్దుకోవాలని, సమాజానికి సేవ చేయడమే నిజమైన వైద్యుడి లక్ష్యమని అన్నారు. కొత్తగా కళాశాలలో చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ సీనియర్ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకను మరింత ఆకర్షణీయంగా చేశారు. కార్యక్రమంలో గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె ఎస్ఎస్ వెంకటేశ్వరరావు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ రంగస్వామి, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సి.సునీల్ కుమార్‌రెడ్డి, వైస్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీ సుశీల, డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ నాగశ్రీలత, హెచ్ఒడిలు, డాక్టర్లు, ఇతర అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, పెద్ద సంఖ్యలో వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.


ఫ్రెషర్స్ డే సందర్భంగా నృత్యం చేస్తున్న విద్యార్థులు

రెండవ ఎఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెండవ ఎఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య, ఆరోగ్యశాఖలో ఏళ్ల తరబడి సేవలందింస్తున్నారని పేర్కొన్నారు. కోవిడ్ కాలంలోనూ క్షేత్రస్థాయిలో రెండవ ఎఎన్‌ఎంలు సేవలందించారని తెలిపారు. యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.వి.నారాయణమ్మ మాట్లాడుతూ పని సర్దుబాటు పేరుతో అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న 2వ ఎఎన్‌ఎంలను సుదూర ప్రాంతాలకు, ప్రస్తుతం నూతనంగా ఏర్పడిన వేరే జిల్లాలకు బదిలీ చేశారని పేర్కొన్నారు. దీని వల్ల దాదాపు 3 సంవత్సరాలు ఆర్థికంగానే కాక మానసికంగాను, రెండవ ఎఎన్‌ఎంలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబాలకు దూరంగా బతుకుతున్నారని తెలిపారు. వీరి పరిస్థితిని మానవతాదృష్టితో పరిశీలించి వారి వారి ప్రాంతాలకు తిరిగి పంపించాలని కోరారు. గతంలో మాదిరిగా యూనిఫామ్ అలవెన్సులు చెల్లించాలని పేర్కొన్నారు. సెకండ్ ఎఎన్‌ఎం లు చేస్తున్న వివిధ పనులకు సంబంధించిన ఇన్సెంటివ్ ఎఎన్‌ఎంలకే చెల్లించాలని కోరారు.


నిరసన తెలియజేస్తున్న జిల్లా వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగులు

ఉద్యోగులకు అండగా ఉంటాం

ప్రజాశక్తి- కడప అర్బన్


ప్రభుత్వ ఉద్యోగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు వి.రఘురామనాయుడు భరోసా ఇచ్చారు. శుక్రవారం భోజన విరామ సమయంలో జిల్లా వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాణిజ్య పనుల శాఖ చిత్తూరు డివిజన్ పరిధిలో పనిచేస్తున్న ఆఫీస్ సబార్డినేట్ లవ్‌కుమార్, భరత్‌ను జిల్లా అధికారి జాయింట్ కమిషనర్ పి.రవీంద్రనాథ్ రెడ్డి భౌతిక దాడి చేసి, కులం పేరుతో దూషించడం దారుణమని పేర్కొన్నారు. ఇలాంటి నీచమైన చర్య ఉద్యోగుల ప్రవర్తన నియమావళికి విరుద్ధమని తెలిపారు. మూడు రోజుల నుంచి కడప జిల్లా వాణిజ్య పనుల శాఖ ఉద్యోగులు అందరూ నిరసన వ్యక్తం చేస్తూ ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, జాయింట్ కమిషనర్‌పై ఎంక్వయిరీ ఆఫీసర్లు వేయడం చాలా సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. ఎంక్వయిరీ వెంటనే పూర్తి చేసి తగు క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. జాయింట్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని వాణిజ్య పనుల శాఖ జెఎసి నాయకులు, ఉద్యోగులు డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, కృష్ణ ప్రసాద్, వాణిజ్య పనులు శాఖ అసోసియేషన్ నాయకులు జె.వి.రమణయ్య, బి.హరికృష్ణ, కె.గంగాధర్, ఎస్.లోకేష్, జి.రవికుమార్, సురసుర శ్రీనివాసులు, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతి నిరోధక అంశాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - కడప


మాట్లాడుతున్న నాగరాజు

సమాజంలో యువత అవినీతి నిరోధక అంశాల పట్ల అవగాహన కలిగి ఉంటే దేశ ఉన్నత లక్ష్యాల సాధన సులువు అవుతుందని యాంటీ కరప్షన్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎన్. నాగరాజు, నౌషద్ అలీ అన్నారు. ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి), కడప ఎన్ఎస్ఎస్ విభాగం విజిలెన్స్ అవగాహన కార్యక్రమాన్ని కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వారు విచ్చేసి 'విజిలెన్స్ అప్రమత్తత ఉమ్మడి సమిష్టి బాధ్యత'అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి పౌరుడూ అవినీతిని నిరోధించడం తన కర్తవ్యంగా భావించి ముందడుగు వేయాలని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ జి రవీంద్రనాథ్ మాట్లాడుతూ యువత అవినీతి నిరోధక చట్టాన్ని దాని ప్రాముఖ్యతను అర్థం చేసుకొని మరింత మందికి అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ వారు ప్రతి సంవత్సరమూ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ పోటీలలో గెలుపొందిన వారికి ముఖ్య అతిథి నాగరాజు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి రవీంద్రనాథ్ బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పి.శివరామకృష్ణ, డాక్టర్ అంకాల నాగరాజు, శ్రీనివాసులు, మహేష్ ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.


రోడ్డు పనులపై బీటెక్ రవితో చర్చిస్తున్న టిడిపి నేత మహమ్మద్ షబ్బీర్

సమస్యలపై బీటెక్ రవితో టిడిపి నేతలు చర్చ

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో ఉన్న సమస్యలను పరిష్కారించేందుకు కృషి చేయాలని టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జి బీటెక్ రవీంద్రనాథ్‌రెడ్డిని ఆ పార్టీ నేతలు కోరారు. శుక్రవారం పులివెందులలోని టిడిపి కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించిన బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డిని మహమ్మద్ షబ్బీర్ కలిసి రోడ్డు పనులు, జలజీవన్ మిషన్ తాగునీటి పైపులైన్‌తోపాటు పలు సమస్యలను వివరించారు. స్పందించిన ఆయన ఫోన్‌లో వేంపల్లెలో జరుగుతున్న రోడ్డు పనులను వేగవంతం చేసేందుకు రెండు టీంలను ఏర్పాటు చేయాలని కాంట్రాక్టర్, అధికారులను కోరారు. పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. జల జీవన్ మిషన్ పనులను కూడా డిసెంబర్‌కు పూర్తి చేసి ప్రజలకు తాగునీటిని అందించాలని సంబంధిత అధికారులను కోరారు. టిడిపి నేతలు మహబూబ్ షరీఫ్, నారాయణరెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు యాసిన్, తెలుగు యవత మండల ఉపాధ్యక్షుడు గంగాధర్ రెడ్డి, బాబు పాల్గొన్నారు.

యూరియా వాడకం తగ్గించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

పంటలు సాగు చేసే సమయంలో యూరియా వాడకాన్ని తగ్గించాలని ఎఒ వెంకటకృష్ణారెడ్డి సూచించారు. ఉప్పలూరు, కొలవలి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో శుక్రవారం ఎఒ ఆధ్వర్యంలో డిబిటి పద్ధతిలో రైతులకు యూరియా బస్తాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకు 2 బస్తాలు బయోమెట్రిక్ ద్వారా యూరియా పంపిణీ చేశామన్నారు. యూరియా అనవసరంగా వాడకుండా వ్యవసాయ అధికారులు సూచించిన పరిమాణం మేరకు వాడుకోవాలన్నారు. నత్రజని ఎరువును ఎక్కువ వాడితే రసం పీల్చే పురుగు, తెల్ల దోమ ఉధృతి ఎక్కువ అవుతుందన్నారు. పంట ఏపుగా పెరిగి దిగుబడులపై ప్రభావం చూపుతుందన్నారు.

విధుల్లో బాధ్యతగా వ్యవహరించాలి

ప్రజాశక్తి - చాపాడు

ఉద్యోగులు విధుల్లో బాధ్యతగా వ్యవహరించాలని డిప్యూటీ సీఈఓ సుబ్రహ్మణ్యం సూచించారు. స్థానిక మండల సభా భవనంలో ఆఫీస్ సబార్డినేట్ మహమ్మద్ హుస్సేన్ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ.. కార్యాలయాలకు వివిధ పనుల మీద వచ్చే ప్రజలకు ఉద్యోగులు సేవకులుగా పనిచేయాలన్నారు. ఆఫీస్ సబార్డినేట్‌గా హుస్సేన్ అందరి ఆదరాభిమానాలు పొందారన్నారు. ఆయన సేవలను అధికారులు కొనియాడారు. అనంతరం హుస్సేన్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిపి టి.లక్ష్మయ్య, ఎంపీడీఓ వీరకిషోర్, తహశీల్దార్ రమాకుమారి, ముద్దనూరు ఎంపీడీఓ రాధాకృష్ణవేణి, మైదుకూరు తహశీల్దార్ రాజసింహ నరేంద్ర, ఎంఈఓ రవిశంకర్, ప్రొద్దుటూరు ఎంపీపీ శేఖర్, డిప్యూటీ ఎంపీడీఓ హరినాథ్, ఏఒ రామానుజం, అధికారులు, హుస్సేన్ బంధుమిత్రులు పాల్గొన్నారు.

జిఒ 36ను ఉపసంహరించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ పాస్ కావాలని సూచిస్తూ రాష్ట్ర విద్యా శాఖ విడుదల చేసిన జిఒ 36ను వెనక్కి తీసుకోవాలని ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి నర్రెడ్డి సంగమేశ్వర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. సెప్టెంబర్ 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు 2010 కంటే ముందు ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించిన వారికి రెండేళ్లల్లో టెట్ అర్హత పరీక్ష ఉత్తీర్ణత సాధించాలని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జిఒ జారీ చేయడం దుర్మార్గమన్నారు.

పలు రకాల వస్తువులు వితరణ

ఎర్రగుంట్ల : పట్టణంలోని రాణివనంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో టిడిపి నాయకులు శుక్రవారం పలు రకాల వస్తువులను వితరణ చేశారు. ఈ సందర్భంగా టిడిపి పట్టణ అధ్యక్షుడు సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. పేదవాళ్ళ ప్రయివేట్ ఆసుపత్రులకు వెళ్లి డబ్బులు వృథా చేసుకోవద్దన్నారు. ఆసుపత్రిలో డిస్పోజబుల్ బెడ్ షీట్స్, బేబీ అండర్ షీట్స్, డైపర్స్ అందజేశారు. వీటిని మాజీ ఎంపిటిసి చెన్నారెడ్డి ఇప్పించారని పేర్కొన్నారు. స్థానిక వైద్యాధికారి జ్యోత్స్నకు అందజేశామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రమేష్ నాయుడు, శేఖర్‌రెడ్డి, మస్తాన్, ఒంటికొమ్ము చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారి ఓబులేసు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలి

చాపాడు (మైదుకూరు) : అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని మైదుకూరు అర్బన్ సిఐ రమణారెడ్డి తెలిపారు. సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ మధు మల్లేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం మైదుకూరు వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ ఏపికే ఫైళ్లను మొబైల్ లో ఇన్‌స్టాల్ చేయవద్దన్నారు. అపరిచితులకు మీ వ్యక్తిగత బ్యాంకు వివరాలు ఇవ్వకూడదన్నారు. ఆధార్ ఓటీపీ, బ్యాంక్ ఓటీపీ అడిగే కాల్స్ నమ్మవద్దన్నారు. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. ప్రిన్సిపల్ ఓబుల్ రెడ్డి పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు మంజూరు చేయాలి

ప్రొద్దుటూరు : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు వెంటనే జీతాలు మంజూరు చేయాలని ఆసుపత్రి సిబ్బంది అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు రాఘవ కోరారు. ఆ మేరకు శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ సుజాతకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు 65 మంది పనిచేస్తున్నారని, వీరికి నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వలేదన్నారు. నాలుగు నెలల జీతాలు కాంట్రాక్టర్ బాలనాగిరెడ్డి తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొంతమంది కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సంఘ అధ్యక్షులు రత్తమ్మ, ప్రధాన కార్యదర్శి కళావతి, వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహులు, కోశాధికారి మహేష్, సహాయ కార్యదర్శి గంగాధర్, కమిటీ సభ్యులు మల్లి, ప్రసాద్, దస్తగిరి, దేవి, దుర్గా, మల్లమ్మ, జ్యోతి అక్క కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



హాజరైన కౌన్సిలర్లు, అధికారులు(ఇన్‌సెట్) మాట్లాడుతున్న చైర్మన్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి, వీధిలైట్లు, డ్రైనేజీ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలని కోరారు. అక్కడక్కడ సిమెంటు రోడ్లు సమస్య ఉందన్నారు. వాటిని త్వరగా పూర్తి చేసేందుకు ప్రయత్నం చాలన్నారు. జగనన్న హౌసింగ్ కాలనీ లబ్ధిదారులు చెల్లించిన రూ.35 వేలు ఎక్కడ ఉందని ప్రశ్నించారు. మున్సిపల్ కమిషనర్ అకౌంట్లో ఉందని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు వైఎస్ మనోహర్‌రెడ్డి, హఫీజ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

జిఒ 590ని కూటమి ప్రభుత్వం రద్దు చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

పులివెందులతో సహా రాష్ట్రంలో ఉన్న పది ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రయివేటు పరం చేస్తూ చంద్రబాబు ప్రభుత్వం జారీ చేసిన జిఒ 590ని రద్దు చేయాలని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి కోరారు. వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వేంపల్లెలోని 6,7,8 వార్డుల్లో ఆపార్టీ నాయకులు ఇంటింటికి వెళ్లి కోటి సంతకాల సేకరణ చేపట్టారు. వీరికి తులసిరెడ్డి సంఘీభావం తెలిపి, పిపిపికి వ్యతిరేకంగా సంతకాలు చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడం ద్వారా పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరం అవుతారని తులసిరెడ్డి చెప్పారు. పేద ప్రజలకు ఉచిత వైద్యం కూడా అందదని తెలిపారు. పిపిపి అంటే ప్రతిభకు పాడే కట్టడమేనని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్.వేణుగోపాల్, రవిశంకర్ గౌడ్, రామచంద్రారెడ్డి, బికారి, కటిక చంద్రశేఖర్, కటిక నాగేంద్ర, రాష్ట్ర ప్రచార సంయుక్త కార్యదర్శి నిసార్, హబీబుల్లా, గణేష్, ఆంజనేయులు, మాజీ చైర్మన్ కుర్రాకుల వెంకటేశు, పద్మా రాజ్‌కుమార్, కుళాయప్ప, రహంతుల్లా ఖాన్, ప్రసాద్, రాజా, మణి గోపాల్ రెడ్డి, ఓబులేసు పాల్గొన్నారు. **తొండూరు :** పేదలకు ఉచిత వైద్యాన్ని దూరం చేసే కూటమి ప్రభుత్వం యత్నాలను సాగనీయబోమని వైసిపి మండల అధ్యక్షుడు భూమిరెడ్డి రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ తలపెట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం అగడూరు గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిటిసి కొప్పల శివశంకర్ రెడ్డి, మండల పరిశీలకుడు బండి రామమునిరెడ్డి, బి.వెంకట రామిరెడ్డి, బి.రజనీకాంత్‌రెడ్డి, జింకా అశ్వనికుమార్, కుడుముల మధు సూదన్‌రెడ్డి, దస్తగిరి, జిల్లా వైసిపి యువజన విభాగ కార్యవర్గ సభ్యుడు ఎస్.లక్ష్మిరెడ్డి, యాడికి బాబు పాల్గొన్నారు. **చాపాడు :** వైద్య కళాశాలల ప్రయివేటీకరణ ఆగే వరకు పోరాటం ఆగదని మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. చియ్యపాడు గ్రామంలో శుక్రవారం మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి టి.లక్షుమయ్య, వైసిపి మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, ఉప మండల అధ్యక్షుడు ఎస్ఆర్ బాల నరసింహారెడ్డి, ఎంపిటిసి సుబ్బరామిరెడ్డి, చిట్టిబాబు, నిరంజన్‌రెడ్డి, రాజా తిమ్మారెడ్డి, రాజేంద్రనాథ్‌రెడ్డి, నాగేశ్వరరావు, మహేష్ యాదవ్, జయరామిరెడ్డి, వెంకటరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వేంపల్లె : పిపిపికి వ్యతిరేకంగా సంతకం చేస్తున్న తులసిరెడ్డి

ఇందిరమ్మ, 'పటేల్' జీవితాలు ఆదర్శనీయం

ప్రజాశక్తి - వేంపల్లె

భారత మాజీ ప్రధాని, భారతరత్న, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ, సర్దార్ పటేల్ జీవితాలు ఆదర్శనీయమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరమ్మ వర్ధంతి, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల శాఖ అధ్యక్షులు బీగాల రామకృష్ణ, అమర్నాథ్‌రెడ్డి, తోపిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, బండారు వెంకటేశు, ఉత్తన్న, ఐచర్ రమణ, చిన్నకోట్ల నాగరాజు, చిలేకంపల్లి సుబ్బారెడ్డి, బ్యాంక్ శ్రీనివాసులు, రవి, బుల్లెట్ రాజా, బద్రీనాథ్, రాఘవయ్య, చెన్నకేశవ, బీసీ ఫ్రంట్ ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షులు గూడూరు రామచంద్ర పాల్గొన్నారు. **సింహాద్రిపురం :** ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎస్ఐ రవికుమార్ పేర్కొన్నారు. వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యత దినోత్సవంలో భాగంగా పోలీసులు విద్యార్థులతో కలిసి రన్‌ఫర్ యూనిటీని బుడ్డాయిపాలెం నుంచి ప్రారంభించారు. **చాపాడు :** అలీనోద్యమ నాయకురాలు, భారతరత్న, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 41వ వర్ధంతి స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. మైదుకూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి చాపాటి రామసుధాకర్‌రెడ్డి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. **వేంపల్లె :** సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి సందర్భంగా శుక్రవారం వేంపల్లె, ఇడుపులపాయి ట్రిపుల్‌ఐటిలో రన్ ఫర్ యూనిటీ నిర్వహించారు. ఆయా పాఠశాలల విద్యార్థులతో కలిసి సిఐ నర్సింహులు, ఎస్ఐ తిరుపాల్ నాయక్ ర్యాలీ నిర్వహించారు. ఇడుపులపాయి ట్రిపుల్‌ఐటిలో విద్యార్థులతో కలిసి ఎస్ఐ రంగారావు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. **ఎర్రగుంట్ల :** సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తితో అందరూ ఐకమత్యంతో మెలగాలని ఎస్ఐ నాగమురళి ప్రజలకు సూచించారు. పట్టణంలో ముద్దనూరు రోడ్డులోని జడ్పిహెచ్ క్రీడ ప్రాంగణంలో శుక్రవారం పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని రన్‌ఫర్ యూనిట్(రాష్ట్రీయ ఐక్యతా దినోత్సవం) నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో శుక్రవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల సమన్వయకర్త ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, ప్రముఖ వైద్యులు వరుణ్‌కుమార్ రెడ్డి, డాక్టర్ రవిశంకర్, మధు, శీను, సురేంద్ర, తేజ, వేమనారాయణ, ప్రభాకర్, శిక్షావలి పాల్గొన్నారు. **ముద్దనూరు :** సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా శుక్రవారం సిఐ దస్తగిరి ఆధ్వర్యంలో జమ్మలమడుగు రహదారిలో పోలీసులు 2కె రన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ రమేష్, సిబ్బంది, యువకులు పాల్గొన్నారు. **వేంపల్లె :**వేంపల్లెలో పోలీసులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం సాయంత్రం పోలీసులు స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో వారు మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా సిఐ నర్సింహులు మాట్లాడుతూ దేశ భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసులను ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలని కోరారు. పోలీసు ఖాకి డ్రస్‌కు ప్రతి ఒక్కరూ గౌరవం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుపాల్ నాయక్, పోలీసు సిబ్బంది, ఆయా పార్టీల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఆటలు మానసిక, శారీరక దృఢత్వానికి ఎంతగానో దోహదపడతాయని మున్సిపల్ కమిషనర్ రాముడు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక నారాయణ పాఠశాలలో నారాయణ ప్రీమియర్ లీగ్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మునిసిపల్ కమిషనర్ జ్యోతి ప్రజ్వలన చేసి ఆటలు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆటలు ఆడటం విద్యార్థి దశ నుండే అలవాటు చేసుకోవాలన్నారు. చదువులోనే కాకుండా ఆటల్లో కూడా ఉన్నతస్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం కిరణ్‌కుమార్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ హరితరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వికలాంగులకు చేయూత

పులివెందుల రూరల్ : మండలంలోని నల్లపురెడ్డిపల్లి గ్రామవాసి లింగారెడ్డి ఓబులరెడ్డి వర్ధంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో వారి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో లింగా కన్‌స్ట్రక్షన్స్ యజమాని మస్తాన్‌రెడ్డి కుమారుడు సాయిచరణ్‌రెడ్డి 25 మంది వికలాంగులకు గృహోకరణాలు వితరణ చేశారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ అధ్యక్షులు డాక్టర్ రఘునాథరెడ్డి, కార్యదర్శి సునీల్‌కుమార్, సభ్యులు బాబు, ప్రభాస్, విష్ణు, వలి పాల్గొన్నారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరికలు

పులివెందుల రూరల్ :పులివెందుల మున్సిపాలిటీలో తెలుగుదేశం పార్టీ బలోపేతం దిశగా అడుగులు పడుతున్నాయి. పులివెందుల టీడీపీ ఇన్‌ఛార్జి బీటెక్ రవి సమక్షంలో స్థానిక నాయకుల ఆధ్వర్యంలో రాజారెడ్డి వీధికి చెందిన సాయి, అతని కుటుంబ సభ్యులతో సహా బంధువులు పెద్ద ఎత్తున టిడిపిలో చేరారు. వీరికి బీటెక్ రవి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. జరగబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో టిడిపి జెండా ఎగరవేయడం ఖాయమని బిటెక్ రవి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పులివెందులలో ప్రతిరోజు క్రమం తప్పకుండా నీటి సరఫరా అవుతోందన్నారు. వచ్చే నెలలో ముఖ్యమంత్రి చంద్రబాబు పులివెందుల పర్యటనకు రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్థసారథి రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల మధుసూదన్‌రెడ్డి, పుష్పనాథ్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కనీస వసతుల్లో ఇబ్బందుల్లేకుండా చూడాలి

ఎర్రగుంట్ల : కనీస వసతులపై ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జడ్‌పి సిఇఒ ఓబులమ్మ అధికారులకు సూచించారు. మండలంలోని చిలమకూరు గ్రామంలో శుక్రవారం ఆమె పర్యటించారు. జిఎల్ఎస్ఆర్ నీటి స్టోరేజీ ట్యాంకులను పరిశీలించారు. స్థానికంగా పారిశుధ్య సేవల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఓబులమ్మ మాట్లాడుతూ పరిశుభ్రమైన నీటి సరఫరాకు, శానిటేషన్ పట్ల చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిఎల్‌డిఒ రామాంజనేయులు, ఎంపీడీవో వెంకటరమణయ్య పాల్గొన్నారు.

కార్మికులకు విడిఎ వెంటనే ప్రకటించాలి

ఎర్రగుంట్ల :రాష్ట్రంలో వివిధ రంగాలలో పనిచేస్తున్న సంఘటిత, అసంఘటిత కార్మికులకు విడిఎ పాయింట్లను వెంటనే ప్రకటించాలని ఏపీ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ సుబ్బిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఆర్టీపీపీలో మాట్లాడుతూ విడిఎ పాయింట్లను ఆరు నెలలకు ఒక మారు సాధారణంగా ప్రకటిస్తారన్నారు. గడువు దాటిపోయి చాలా రోజులు అవుతున్నా యాజమాన్యం పట్టించుకోకపోవడంతో కార్మికులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న కార్మికులకు యాజమాన్యం అన్యాయం చేస్తోందని సుబ్బిరెడ్డి పేర్కొన్నారు.


బురద రోడ్లను చూపిస్తున్న జి.శివకుమార్

సుందరయ్య నగర్‌లో సిసి రోడ్లు వేయాలి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరులోని సుందరయ్య నగర్‌లో సిసి రోడ్లు వేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్ కోరారు. శుక్రవారం సుందరయ్య నగర్‌లో నివాసం ఉన్న వారితో కలిసి ఆయన వీధులను పరిశీలించారు. అనంతరం శివకుమార్ మాట్లాడుతూ 9ఏళ్ల నుంచి అత్యంత నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు చెందిన దాదాపు 200 కుటుంబాలు సుందరయ్య నగర్‌లో ఉంటున్నారని ఎతలిపారు. గతంలో సిపిఎం సాయంతో మట్టి రోడ్డును ఏర్పాటు చేశామన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో మట్టి రోడ్లు కొట్టుకుపోయాయన్నారు. చిన్నపాటి వర్షానికి వీధులన్నీ బురద, గుంతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీధుల్లో నడవడానికి కూడా ఇబ్బందిగా ఉందన్నారు. తాము అధికారంలోకి రాగానే కాలనీకి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎన్నికల సమయంలో నాయకులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే స్పందించి రోడ్లను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు చాంద్‌బాషా, లక్ష్మీదేవి, కాలనీ వాసులు మేరీ, బాబు పాల్గొన్నారు.

వ్యర్థ పదార్థాలు రోడ్లపై వేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - చాపాడు

నివాసాలు, వ్యాపార సముదాయాల్లోని వ్యర్థ పదార్థాలను రోడ్లపై వేస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపిడిఒ వీరకిషోర్ హెచ్చరించారు. మండల కేంద్రమైన చాపాడు ప్రధాన రహదారి వెంబడి ఉన్న వ్యర్థ పదార్థాలను జెసిబి యంత్రంతో తొలగించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఇళ్లలోని పొడి, తడి చెత్తాలను సేకరించేందుకు సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. చెత్తను ఎవరు కూడా రోడ్లపై వేయ కూడదన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ చెత్తను పడేసే వారిని గుర్తించి నోటీసులు ఇవ్వాలన్నారు. అప్పటికి వారి తీరు మారకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ హరినాథ్, పంచాయతీ కార్యదర్శులు సురేష్ బాబు, సుబ్బరాయుడు, సర్పంచ్ కుమారుడు జమాల్, సిబ్బంది పాల్గొన్నారు.

పండ్ల తోటలకు డ్రిప్ పరికరాలను అమర్చుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

పండ్ల తోటలు సాగు చేసిన రైతులు డ్రిప్ పరికరాలను అమర్చుకుంటే నీటి ఆదా కావడంతోపాటు ఆదాయం కూడా బాగా వస్తుందని ఎపిడి మురళీమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పాములూరు గ్రామంలో శుక్రవారం సాగు చేసిన పండ్ల తోటలను సూక్ష్మ నీటి సాగు పథకాన్ని ఆయన పరిశీలించారు. రైతులకు డ్రిప్ పరికరాలపై అవగాహన కల్పించారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు డ్రిప్ పరికరాలను పంపిణీ చేస్తామన్నారు. మైక్రో ఇరిగేషన్ ద్వారా వ్యవసాయం లాభదాయకంగా ఉంటుందని సూచించారు. అన్ని వర్గాల రైతులకు స్పింకర్లు 50 శాతం సబ్సిడీతో ప్రభుత్వం ఇస్తున్నట్లు తెలిపారు. డ్రిప్ సిస్టమ్ ద్వారా ఎరువులు కూడా సమర్థవంతంగా వినియోగించవచ్చునని వివరించారు. ప్రతి రైతు ఆయా పంటలకు డ్రిప్ పరికరాలతో వ్యవసాయం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆయా శాఖల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి - చక్రాయపేట

చక్రాయపేట ఎంపిడిఒ బండి రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా చక్రాయపేట పంచాయతీ కార్యదర్శి విజయభాస్కర్ నాయక్ అధ్యక్షతన ముఖ్యఅతిథిగా తహశీల్దార్ పి.విజయ కుమారి, వేంపల్లి ఎంపిడిఒ కే కులాయమ్మ ఆయనకు మెమొంటోలు అందజేసి సన్మానించారు. పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాజశేఖర్‌రెడ్డి సేవలను కొనియాడారు. కార్యదర్శులు, వీఆర్‌ఏలు, ఎంపీడీవో కార్యాల సిబ్బంది పాల్గొన్నారు.

పిఎం స్వానిధి రుణాల పంపిణీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణంలో మున్సిపాలిటీ కార్యాలయంలో పిఎం స్వానిధి రుణాలను, యూనియన్ బ్యాంక్ అధికారులు మెప్మా ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 193 మంది లబ్ధిదారులకు (వీధి విక్రయదారులకి) రూ.31,50,000 రుణ మొత్తాన్ని చెక్కు ద్వారా యూనియన్ బ్యాంక్ కడప రీజినల్ హెడ్ లక్ష్మీ తులసి అందజేశారు. మహిళ స్వయం సహాయక సంఘాలకు రూ.కోటి ఇరవై లక్షలు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బ్యాంక్ ద్వారా అందే రుణాలను సద్వినియోగం చేసుకొని అర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే సంక్షేమ సంవృద్ధి పథకాల అమలులో యూనియన్ బ్యాంక్ ముందంజలో ఉందన్నారు. బ్యాంక్ ద్వారా పీఎం సురక్ష, పీఎం జీవనజ్యోతి, అటల్ పెన్షన్ వంటి తక్కువ ప్రీమియం గల ఇన్సూరెన్స్ పథకాలు ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ మేనేజర్ పుల్లయ్య, మెప్మా టీఎంసీ నాగేంద్ర, సీవోలు వసంత్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ సురేంద్ర, ఫీల్డ్ ఆఫీసర్ శరత్, పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - దువ్వూరు

మొంథా తుఫానుతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. ఆ మేరకు శుక్రవారం తహశీల్దార్ సంజీవరెడ్డి, వ్యవసాయ అధికారి అమర్నాథ్‌రెడ్డికి వినతిపత్రమిచ్చారు. తీవ్ర వరద నీటితో వరి పంటకు తీవ్రంగా నష్టం వాటిల్లిందన్నారు. రామాపురం, మీర్జాఖాన్‌పల్లె, గొల్లపల్లె, గుడిపాడు, చల్లబసాయపల్లె, మనేరామ్ పల్లె, చిన్న సింగనపల్లె, మదిరేపల్లె, దాసరిపల్లె, నీలాపురం, మూడిండ్లపల్లె, ఎంకుపల్లె దువ్వూరు గ్రామాల్లో మినుము, కెపి ఉల్లి, వేరుశెనగ, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయన్నారు. తుఫాను ప్రభావిత గ్రామాల్లో వేగంగా పర్యటించి, రైతులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.